ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 16 మార్చి 2024

ఇఫ్తార్ | 6:31
శనివారం
సహర్ | 5:02
ఆదివారం

కొనసాగుతున్న దాడులు

కోరుట్ల, మార్చి 15 : పట్టణంలోని పలు ప్రాం తాలలో ఉన్న వాటర్ ప్లాంట్స్, ఐస్ క్రీం విక్రయ కేంద్రాలపై మున్సిపల్ అధికారులు దాడులు రెండవ రోజు కూడ కొనసాగుతున్నాయి. కమిషనర్ తిరుపతి ఆ దేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. నిబంధలకు విరుద్ధంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్స్, ఐస్ క్రీం నిర్వహకులకు జరిమానాలను విధించారు.

కొనుగోళ్లకు సన్నాహాలు

- జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం 5.65 లక్షల మెట్రిక్ టన్నులు
- 407 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- గన్నీ సంచులు సగం ఇప్పటికే సిద్ధం
- దృష్టి సారించిన ఉన్నతాధికారులు

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యేటా వరిసాగు విస్తీ ర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఎస్సారెస్పీ నీటితో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండడం, ఆశించినస్థాయిలో సాగునీరు అందడంతో వరి సాగు రైతుల సంఖ్య యేటా పెరుగుతూనే ఉంది. గత యాసంగితో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం పెరగడంతో ధాన్యం కొనుగోలుకు అధికారులు అదే తరహాలో సన్నాహాలు చేస్తున్నారు. మార్చి చివరి వారం, ఏప్రిల్ మొదటి వారంలో పంట చేతి కొచ్చే సమయం కావడంతో రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఇటీవల జగిత్యాల కలెక్టరేట్ కార్యా లయంలో అదనపు కలెక్టర్ పర్స రాంబాబు ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

జిల్లాలో 407 కేంద్రాల ఏర్పాటు..

సన్నరకాలకు ప్రభుత్వం ఇచ్చే ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు వానాకాలం సీజన్‌లో ప్రైవేటు కొనుగోలు కేంద్రాల వైపే మొగ్గు చూపడం తో ప్రభుత్వ లక్ష్యం నెరవేర లేదు. యాసంగిలో 407 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 5,65,241 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అ ధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.. కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అం దుబాటులో లేకపోవడం తేమ పేరుతో ధరలు తగ్గించడం ఇతరత్రా సమస్యలు ఉన్నాయని ఆరోపణలు వినిపించినా అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా సమాధానం ఇస్తున్నారు. రైతులు సన్న రకాలు పండించడం వీటికి ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో అధిక ధరలు లభిస్తుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ సీజన్‌లో మాత్రం జిల్లాలో 407 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 5.65 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని అధికారులు అంచనాలు తయారు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో 133 కేంద్రాలు, 273 సహ కార సంఘాలు, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలో 2021-22 యాసంగి సీజన్‌లో వరి 2,70,540 ఎకరాల్లో సాగు 2022-23 యాసంగి సీజన్‌లో 2,80,706 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత 2023-24 యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,97,059 దీని ద్వారా 5.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సుమారు 1.54 లక్షల గన్నీ సంచులు అవసరమన్న అంచనా ఉంది. ఇందుకు గానూ ఇప్పటికే పౌరసరఫరా శాఖ వద్ద సుమారు 70 లక్షల గన్నీ బ్యాగులు అందుబా టులో ఉన్నాయి. అవసరమైన సమయంలో మరిన్ని సంచులు తెప్పించడానికి నిర్ణయించారు.



జగిత్యాల జిల్లాలో ఆరబోసిన ధాన్యం(ఫైల్)

కొనుగోళ్ల ఏర్పాటుపై దృష్టి సారించిన అధికారులు..

ఇటీవల పలు ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులచే సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు అం దించారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సైతం జిల్లా కేంద్రంలో జిల్లా సివిల్ సప్లయి ఋధికారులు, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సహకార శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా సహాయ లేబర్ కమిషనర్, జిల్లా తూనికలు కొలతలు శాఖ, జిల్లా రవాణా శాఖ అధికారులతో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై దిశ నిర్దేశం చేశారు. జిల్లా పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు, జిల్లా లారీ ట్రాన్స్ పోర్టు ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన...

ప్రతీ కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులైన నీడ, మంచినీరు, తా త్కాలిక టాయిలెట్స్ సమకూర్చడంపై అధికారులు దృష్టి సారించారు. వి ద్యుత్ కనెక్షన్, ఆన్‌లైన్ వసతి ఉండడంతో పాటు ప్రతి ఒక్క అధికారి క్షే త్ర స్థాయిలో పర్యవేక్షించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతీ కొనుగో లు కేంద్రంలో రెండు ప్యాడి క్లీనింగ్ మిషిన్స్ అందుబాటులో ఉంచుతు న్నారు. రైతులకు సరిపడు టార్పాలిన్ కవర్లు, ఏ రోజుకు ఆ రోజు నాణ్యత ను పరిశీలించి రికార్డు చేసే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వరి ధాన్యం క్వింటాలుకు కామన్ రకానికి రూ. 2,183 మద్దతు ధర..

ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాకు గ్రేడ్-ఏ రకానికి రూ. 2,203 మద్దతు ధర, కామన్ రకానికి రూ. 2,183 మద్దతు ధరను చెల్లించనుంది. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యా న్ని పరిశీలించిన తరువాతే ధర నిర్ణయి స్తారు. రైతులు మార్కెట్ కు ధాన్యం తీసుకొచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, వీఆర్‌వో, ఏఈవోతో ధ్రువీకరణ పత్రం తీసుకు రావా ల్సి ఉంటుంది. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి న వెంటనే రైతు వివరాలను ఎప్పటిక ప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

71 పారాబాయిల్డ్ రైస్ మిల్లుల భాగస్వామ్యం...

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో 71 పారా బాయిల్డ్ రైస్ మిల్లులు కొనుగోలులో భాగస్వామ్యం కానున్నాయి. ప్రతీ రైస్ మిల్లులో సుమారు 50 నుంచి 60 మంది హమాలీలు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని మిల్లర్లకు అధికారులు సూచించారు. ఎప్పటికప్పుడు మిల్లుకు వచ్చిన లారీని అన్‌లోడ్ చేసి త్వరిగతిన దిగుమతి జరిగేలా చూడాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి
వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌరసరఫరా అధికారి



జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు 407 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా ల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం. వరి ధాన్యం కోతలు ప్రారంభం అయ్యే లోపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రయ త్నిస్తున్నాము.

ధర్మపురి బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి స్వామి చిత్రపటం ఇస్తున్న విప్ అడ్లూరి, అర్చకులు

ధర్మపురి, మార్చి 15: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని శుక్రవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ శుక్రవారం ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉన్న సీఎంను వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా కలిసి, సతీసమేతంగా బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఆయను స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. స్పందించిన సీఎం ఉత్సవాలకు హాజరవుతామని హామీ ఇచ్చినట్లు ఈవో తెలిపారు. వారి వెంట వేదపండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి నరసింహమూర్తి, జూనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న విప్ అడ్లూరి, ఎంపీటీసీ

వెల్గటూర్, మార్చి 15: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చెగ్యాం ఎంపీటీసీ రంగు తిరుపతి చెగ్యాం ముంపు బాధితులకు చెందిన 126 ఇళ్లకు సంబంధించి రూ.18 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని సీఎంకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పరిహారం అందజేసి ముంపు బాధితులను ఆదుకోవాలని కోరారు. చెగ్యాం, కోటిలింగాల, ముక్కట్రావ్‌పేట, రాంనూర్, తాళ్లకొత్తపేట, ఉండెడ ముంపు గ్రామాలకు చెందిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అందజేయాలని విన్న వించారు. మండలంలోని రైతాంగానికి సాగు నీరు అందించి ఆదుకోవాలని నాయకులు సీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు శైలేందర్‌రెడ్డి, మాజీ ఎండపల్లి సింగిల్‌విండో చైర్మన్ గోపాలరెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న యాదవులు

మేడిపల్లి, మార్చి 15: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లిలో యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆది ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా వర్గాల ప్రజలకు ఏకకాలంలో 15 కార్పొరేషన్లు ఏర్పాటు ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరేస్తుండటంతో ప్రతిపక్ష నాయకులకు మింగుడు పడటం లేదని అదే అక్కసుతో ప్రభుత్వంపై ఏదో రకంగా నిందలు మోపుతున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని పార్లమెంట్ ఎన్నికల్లోనూ తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు ఆదిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ నా యకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెల్గటూర్, మార్చి 15: మండలంలోని రాజక్కపల్లి ఒడ్డెర కాలనీలో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మాజీ సర్పంచ్‌లు బోడకుంటి రమేష్, మేరుగు మురళి గౌడ్‌లు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సుమారు రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఒడ్డెర కాలనీ వాసులు విప్ అడ్లూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, నరేష్ గౌడ్, గుమ్ముల వెంకటేష్, మల్లేష్, సతీష్, అశోక్, శేఖర్, వేణు, శ్రీనివాస్, ప్రవీణ్, హరి, ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, శేఖర్, కారోబార్లు సతీష్, సాయి పాల్గొన్నారు.

చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించడం ప్రధానికి లెక్క కాదు

- పాలకులకు చిత్తశుద్ధిలేకనే అధ్వానంగా చెరుకు ఫ్యాక్టరీల దుస్థితి
- కాంగ్రెస్ పాలన కమిటీలకే పరిమితం అంటూ అర్వింద్ వ్యాఖ్యలు



బీజేపీలో చేరిన వారితో ఎంపీ అర్వింద్

జగిత్యాల అర్బన్, మార్చి 15: దేశంలో అనేక చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించిన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్రంలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించడం పెద్ద లెక్కేం కాదని, తెలంగాణలో పాలకులకు చిత్తశుద్ధిలేకనే రాష్ట్రంలో ఇలా చెరుకు ఫ్యాక్టరీల దుస్థితి ఇలా తయారైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటుగా స్పందించారు. ఈ నెల 18న జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో స్థానిక గీతావిద్యాలయం ఆవరణలో గల మైదానాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ 18న ఉదయం 9:30గంటలకు మోదీ సభకు హాజరవు తారని, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు, మోదీ అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో, పసుపు రైతులకు ధర పెంపు అంశంలో తీసుకున్న ప్రత్యేక నిర్ణయాలు చొరవతో పసుపు ధర అమాంతం పెరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న మామిడి పంటపై, మామిడి రైతుల సమస్యలపై ప్రధానితో చర్చించామని, ప్రధాని పర్యటన నేపథ్యంలో హామీ వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పాలకులకు చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించే చిత్తశుద్ధి లేదని, దేశంలో ఇప్పటికే 66 చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్ల కమిటీలకే పరిమితం అవుతారని, ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కమిటీలో సభ్యులుగా ఉన్న విషయాన్ని అర్వింద్‌గుర్తు చేశారు. యూసీసీ, ఎన్ఆర్‌సీ తదితర బిల్లుల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాద్ధాంతం చేయడం విచారకరమన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, కొక్కు గంగాధర్, తిరుపతి, ఆముద రాజు, లక్ష్మీ తదితరులున్నారు.

●విజయసంకల్ప సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చిన ఎంపీ అర్వింద్ అనంత రం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి నివాసానికి వెళ్లారు. పలువురు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా, వారికి అర్వింద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మోదీ సభను విజయవంతం చేయడంతో పాటు, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు.

కారుణ్య నియామకపత్రం అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఎంపికయిన సబా అర్జుమండ్ అను మహిళకు ఉద్యోగ పత్రాలను జడ్పీ చైర్‌ప ర్సన్ దావ వసంత సురేశ్ అందజేశారు. ప్రమా దవశాత్తు ఇటీవల మృతి చెందిన మొహిజ్ అను డ్రైవర్ కుటుంబానికి రూ. 3 లక్షల ఆర్థిక సహాయం, మొ హిజ్ సతీమణి సబా అర్జుమండ్‌కు కారుణ్య నియామక పత్రాన్ని శుక్రవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. విద్యార్హతలకు అనుగుణంగా ఆఫీస్ సబ్ ఆర్డినేటర్ ఉద్యోగానికి ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరణ్ పాల్గొన్నారు.

కవిత అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధం

జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

జగిత్యాల టౌన్, మార్చి 15 : జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఆరోపించారు. ఈడీ అధికారులు కవితను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల వేళ కక్ష పూరిత వ్యవహారంతో కవితను అరెస్టు చేయడం బీఆర్ఎస్‌ను అణగ దొక్కడమే అని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు కవిత అరెస్టును క్షమించరని, భగ్గుమంటారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అత్యాచార నిందితుడిని ఉరి తీయాలని ధర్నా

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని భీమారం మండలం వెంకటరావు పేట గ్రామానికి చెందిన బేడ, బుడుగ, దళిత, అంబేద్కర్ సంఘాల నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ నిందితుడికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ వెంకట్‌రావు పేట గ్రామంలోని బేడ, బుడగ కులానికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఈ నెల 10న వేములవాడలోని ఓ లాడ్జ్‌లో ఓ వ్యక్తి మాయ మాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. బాధితురాలు ప్రాణప్రాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి నిందితుడిని ఉరి తీసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బేడ, బుడుగ, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

పంటలు ఎండకుండా చర్యలు చేపట్టాలి

సారంగాపూర్, మార్చి, 15 : పంటలు ఎండకుండా సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బట్టపెల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల రైతులు పంటలకు నీరందక ఎండుతున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారుల పర్యవేక్షణ కొరవడిందని డీఈ చక్రు నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా అధికారులు వ్యవహరించడం సరి కాదన్నారు. అంతకు ముందు సారంగాపూర్ ఎస్సీ కాలనీలో చేపడుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు.

జగిత్యాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సమాగ్రాభివృద్ధే కాం గ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జిల్లా కేంద్రంలోని 5వ, వార్డు కౌన్సిలర్ గుగ్గిల్ల హ రీష్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దేవిశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీష్‌తో పాటు 100 మందికిపైగా ఎమ్మెల్సీ చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుని మాట్లాడారు. ఉద్యోగాలు ఇవ్వకుండా దేశ యువతను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. గృహలక్ష్మి పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం మంజూరు పత్రాలు మాత్రమే ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనతి కాలంలోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేశామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తుం దని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగ భూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మహిళా విభాగంగ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, నాయకులు గాజుల రాజేందర్, ఆడెపు సత్యం ఉన్నారు. అలాగే జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గంగం మహేష్, భారతపు రమేష్, కావాటి గంగాధర్‌లు, 25వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్, సుధాకర్, రాకేష్, మహేష్, సంతోష్ ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ వీఎస్ఎస్ కమిటీ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు, ఎస్సీ మాల, మాదిగ సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు ప్రొసిడింగ్ పత్రాలను ఎమ్మెల్సీ చేతుల మీదుగా అంద జేశారు. 2023-24 సంవత్సరానికి గాను శ్రీనిధి రుణాలకు సంబంధించి మహిళలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడాన్ని హర్షిస్తూ పలువురు మహిళా సంఘాల సభ్యులు జీవన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

పీఎం సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పరిశీలించారు. సభాస్థలి, హెలిప్యాడ్, వీఐపీ పార్కింగ్, ట్రాఫిక్ రూట్లు, జనరల్ పార్కింగ్ స్థలాలను అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. అనంతరం బందోబస్తు ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘు చందర్, రవీంద్ర కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు ఉన్నారు.

మైనింగ్ ఏడీగా జయిసింగ్

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీగా కె జయిసింగ్ నియామకం అయ్యారు. జగిత్యాలలో పనిచేస్తున్న ఏడీ విజయ్ కుమార్ రాథోడ్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో భద్రాచలం కొత్తగూడెం ఏడీగా పనిచేస్తున్న జయిసింగ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కృషిచేయండి

- డీఆర్‌వో పవన్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 15: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్వీప్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఓటర్లందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాలేజీల్లో విద్యార్థులకు, స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఒక చోట తొలగించాలని, వయస్సుపై బడిన వారు కొత్తగా ఓటు నమోదుకు వస్తే పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు వివిధ అంశాలపై అధికారులు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎన్‌వైకె కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, తహసీల్దార్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

లలితాంబికా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

రాయికల్, మార్చి 15: రాయికల్ పట్టణ కేంద్రంలోని లలితాంబిక దేవాలయంలో 16 రోజుల పండుగలో భాగంగా లలితాంబికా ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం దేవాలయంలో మాతలచే బోనాలు, మంగళహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గురూజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మినేని గంగాధర్, సభ్యులు సురతాని భాగ్యలక్ష్మి, తోకల రాజేందర్, సుభాష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, మార్చి 15: వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చెగ్యాం, శాఖాపూర్, మారేడు పల్లి గ్రామాలలో ఉపాధాహామి కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూ సర్వే

● ఆందోళనలో రైతులు ● భూములకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్



కొత్తపల్లి శివారు భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్, మార్చి 15: గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి రెవెన్యూ అధికారులు భూ సర్వే చేపట్టారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు 131.8 కిలోమీటర్లు ఎన్ హెచ్ 63ని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేగా రూపొందించడానికి రూ.3,850 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లాలో మెట్‌పెల్లి నుండి ప్రారంభమై రాయపట్నం వద్ద ముగియనున్నది. సుమారు 36 కిలోమీటర్లు మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం జరుగనున్నట్లు అధికారులు తెలిపారు.

వెల్గటూర్ మండలంలో 1.92 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం జరుగనుంది. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూ సర్వే ప్రారంభించారు. వెల్గటూర్ మండలంలో నేషనల్ సర్వే అథారిటీతో కలిసి ఆర్ఐ రాజేశ్వరి, రికార్డు అసిస్టెంట్ సంతోష్, సర్వేయర్ మహేష్‌లు సర్వే నిర్వహిస్తున్నారు. ఎక్కువ శాతం భూములు వరం గల్-రాయపట్నం రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉండడం వలన భూములకు అధిక ధర వస్తుందని రైతులు ఆనందించేవారు. కానీ ఉరుము లేని పిడుగు లా రెవెన్యూ అధికారులు వచ్చి తమ భూముల్లో సర్వే పనులు చేపడు తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ హైవే నిర్మాణంలో తమ విలువైన భూములు పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డును నిర్మించడానికి నిర్ణయించిన రూట్‌లో కాకుండా రూట్ మార్చి తమ పొలాల మీదుగా రోడ్డు వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువ ప్రకారం ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతులు కోల్పోతున్న భూములు

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులోని వ్యవసాయ పట్టా భూములను రైతులను కోల్పోనున్నారు. వివిధ సర్వే నంబర్లలో రైతులు సుమారుగా కోల్పోయే వ్యవసాయ భూమి వివరాలు అధికారులు అంచనావేశారు. సుమారు 20 సర్వే నంబర్లలో 48 ఎకరాల భూమిని రైతులు కోల్పోనున్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో 1.92 కిలోమీటర్ల పొడవు హైవే రోడ్డు నిర్మించనున్నారు. ఎంజైమెంట్ సర్వే, సబ్ డివిజన్ సర్వే పూర్తి అయిన తరువాత రైతులు ఎంత మొత్తంలో భూమిని కోల్పోతున్నారో ఖచ్చితంగా చెప్పవచ్చని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఆయా సర్వే నంబర్ల లోని రైతులు తమ భూమి రికార్డులు అధికారులకు చూపించాలని పేర్కొన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత ఎంజైమెంట్, సబ్‌డివిజన్ రికార్డులు ఏడీ, జిల్లా కలెక్టర్, ఆర్‌డీవోలకు పంపనున్నారు. అప్రూవల్ అయిన తరువాత అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అప్పుడు రైతులు తమ భూమి ఎంత పోతోంది అనే విషయం తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

● గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనులు

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే విస్తరణ పనులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ప్రారంభమై పడిగల, అంక్సాపూర్, కమ్మరిపల్లి, మెట్‌పల్లి, చెల్గల్ మీదుగా జగిత్యాల, జగిత్యాల రూరల్ మండలం పొలాస, బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేట, బుగ్గారం, మద్దునూర్ గండి మీదుగా ధర్మపురి మండలం రాయపట్నం మీదుగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, శివారు లోని గోదావరి నదిని దాటుతుంది.

గోదావరి అవతలి వైపు నుంచి మోదెల, లక్షెట్టిపేట, తిమ్మాపూర్, ఇటిక్యాల్, పోతెపల్లి, గెల్లకోట, మిట్టపల్లి, హాజీపూర్, నర్సింగాపూర్, గుడిపేట, ముల్కాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగనున్నాయి.

మార్కెట్ ధర చెల్లించాలి అనవేని బుచ్చయ్య, రైతు



రోడ్డు నిర్మాణం కింద మా విలువైన భూములు పోతున్నాయి. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ఉన్న కాస్త భూమి పోతోంది. ప్రభుత్వం మా విలువైన భూములకు మార్కెట్ ధర చెల్లించాలి. భూములు పోతున్న రైతుల కుటుంబాలకు ఉద్యోగావకాశం కల్పించాలి.

రైతులు సహకరించాలి: తహసీల్దార్ శేఖర్



నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి అధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలి. సర్వే పూర్తి అయిన తరువాత ఏడీ, కలెక్టర్, ఆర్‌డీవోలకు రిపోర్టు పంపిస్తాం. అప్రూవల్ అయ్యాక ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తారు. అప్పుడు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు. రైతుల ముందే సర్వే అధికారులకు రైతులు భూ వివరాలు ఇచ్చి సహకరిస్తే తప్పులు దొర్లకుండా ఉంటుంది.

స్టడీ మెటీరియల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) రిక్రూట్‌మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10,000 మంది బీసీ (ఏబీడీ) అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.tsbcstudy circle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178, 040-27077929 సంప్రదించాలని సూచించారు.

రూ.7,800 పలికిన పత్తి ధర



జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 43 మంది రైతులు 497 క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గొనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ. 7,800, కనిష్ఠ ధర రూ. 6300 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్లో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన రైతు మల్లయ్య

మానకొండూర్, మార్చి 15 : మండలంలోని దేవంపల్లికి చెందిన మంద మల్లయ్య (54) అనే రైతు శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా పొలం వద్ద విద్యుత్ వైరు తెగి పడి ఉండడంతో గమనించని మల్లయ్య కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

నాలుగు ఇళ్లలో చోరీ

గంభీరావుపేట, మార్చి 15: గంభీరావుపేట మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను వణికిస్తున్నాయి. సముద్రలింగాపూర్‌లో మూడిళ్లలో చోరీ సంఘటన మరవక ముందే మల్లారెడ్డిపేటలో గురువారం రాత్రి నాలుగిళ్లలో చోరీ జరిగింది. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. జక్కుల మల్లేశం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. దొంగలు మల్లేశం ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని 2 తులాల బంగారు నక్లెస్, 10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా పొన్నాల శ్రీదేవి ఇంట్లో తులం బంగారం, 20 తులాల వెండి, ఫర్హానా బేగం ఇంట్లో రూ.30 వేలు, జక్కుల బాలవ్వ ఇంట్లో అర తులం బంగారం, నగదు ఎత్తుకెళ్లారు.

పోలీసుల అదుపులో జగిత్యాల వైద్యుడు..?

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం కేసులో జగిత్యాల పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్ బ్యూరో, డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టి వైద్యుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. జగిత్యాలలో పాటు హైదారాబాద్‌లో ఉన్న గృహాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. జగిత్యాలకు చెందిన వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం చర్చనీయంశంగా మారింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 15: చదువురావటం లేదని మనస్తాపంతో చెప్యాల అశ్విత్‌కుమార్ (23) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో టౌన్ పోలీసులు వివరాల ప్రకారం.... హనుమాన్‌నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (సిరిసిల్ల జిల్లా) ఎల్లయ్యగౌడ్ భార్య, కూతురు, కొడుకు అశ్విత్‌కుమార్‌లతో హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అశ్విత్ కుమార్ చదువులో వెనుకబడ్డాడు. ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కాగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసి పాసయ్యాడు. పైచదువులు చదవలేకపోతున్నానని తరచుగా బాధపడేవాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అశ్విత్ కుమార్ తల్లి, సోదరి సామాను కొనుగోలుకు బయటకు వెళ్లారు. తండ్రి ఎల్లయ్యగౌడ్ మరో గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సామగ్రితో వచ్చిన తల్లి అశ్విత్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఎత్తలేదు. భర్తకు ఫోన్ చేసి సామగ్రి తీసుకుని ఇంట్లోకి వెళ్లారు. అశ్విత్ గది తలుపులు మూసి ఉండటంతో బలవంతంగా తెరిచేసరికి అశ్విత్‌కుమార్ ఉరికి వేళాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్యగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పశువైద్యుల సంఘం డైరీ ఆవిష్కరించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మార్చి 15 : తెలంగాణ పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో 2024 సంవత్సర డైరీని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రిని సంఘనాయకులు ఘనంగా సన్మానించారు. మాచర్ల గార్డెన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో డైరీని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆనాటి ప్రభుత్వ అనాలోచిత చర్యల మూలంగా క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం చేసే పశు వైద్యులు మనోవేదనకు గురై ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విచారణను త్వరగా ముగించి పాడి, జీవాలపై ఆధారపడిన రైతులకు సేవలను విస్తరించి, తెలంగాణ రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్, విజయభార్గవ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, లింగారెడ్డి, తెలంగాణ పశు వైద్యశాస్త్ర చికిత్సకుల సంఘం అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక, సామాజికాభివృద్ధి

మహిళా డిగ్రీ కళాశాలలో స్త్రీచైతన్య సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కొర్వి వినయకళ

గణేష్‌నగర్, మార్చి 15: సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా నిలదొక్కుకునేందుకు స్త్రీలకు ఏకైకసాధనం విద్య ఒక్కటేనని గురుకుల కళాశాలల పూర్వ ప్రత్యేక అధికారి, ఆంగ్ల అధ్యాపకులు డా. కొర్వి వినయకళ ఉద్బోధించారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన చైతన్య సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న వినయకళ 'చదువు, సాహిత్యం, స్త్రీచైతన్యం' అనే అంశంపై ప్రసంగించారు. లింగవివక్షను కుటుంబపేదరికాన్ని ఎదురించి విజేతగా నిలబడగల శక్తి విద్య ద్వారా మాత్రమే సాధ్యమని పలు ఉదాహరణలతో విశ్లేషించి చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తూము లూరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ తాము విద్యార్థులుగా ఉన్నపుడు మహిళలకు ఇన్ని అవకాశాలు లేవని, ఇప్పటి ఆధునికతను విద్యార్థులు ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలువాలని సూచించారు. కార్యక్రమ సమన్వయకర్త తెలుగుశాఖ అధ్యక్షులు డా. మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా పనిచేస్తున్న మహిళా అధ్యాపకులను, తమ మధ్యనే ఉన్న కొందరు విద్యార్థుల జీవనగాథలను వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు నారోజు వెంకటరమణ, డా. మల్లోజల లక్ష్మణరావు, గాదెగాని పరిమళ, శ్రీరాముల తిరుపతి, షాలిని, జ్యోతి, అపర్ణ, తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్య ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, టీజీసీజీ టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా కె. సురేందర్‌రెడ్డి కళాశాల విద్యా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కళాశాల ప్రిన్సిపాల్ సంఘం అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమన్వయం సాధించడం ద్వారా కళాశాలల అభ్యున్నతికి తోడ్పడుతున్నారని అన్నారు. సమావేశంలో తెలంగాణ కళాశాల విద్య ప్రిన్సిపాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డా జి. రాజారెడ్డి, డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి కామరాజు, నాన్ టీచింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ నాగరాజు, ప్రిన్సిపాళ్లు వై సత్యనారాయణ, కె లక్ష్మీనరసయ్య, డా సంతోష్, డా మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంజన్నకు పంచామృత అభిషేకం

కొండగట్టులో రెండో రోజు ఘనంగా పవిత్రోత్సవాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 15: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో రెండో రోజు శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు ఉప నిషత్తు పారాయణం, వేదపఠనం, మూల విరాట్టుకు పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, పంచసూక్త హవనం, మహనివేదన, మంత్ర పుష్పం, శాత్తు మొర తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయం కాలం శ్రీ లక్ష్మీ సహస్రనామ పారాయాణం, కుంకుమార్చన, ఒడి బియ్యం, హనుమాన్ చాలీసా పారాయణలు చేశారు. అనంతరం మూల మంత్ర హవనం, పవిత్రలకు శయ్య, ఫల, పుష్పాదివాసం, బలిహరణం, నివేదన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళల్లో భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, మార్చి 15: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.




అధికారి కాత్యాయనికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న తిరుపతిరావు

రాజన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్, ఐఏఎస్ అధికారి కాత్యాయని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



పంట పొలాల మధ్య స్వామివారి ఆలయం

ఏడుకొండలవాడికి నిరాదరణ

● నిర్లక్ష్యానికి గురవుతున్న పురాతన వేంకటేశ్వర ఆలయం

● పట్టించుకొనేవారే కరువు

మల్యాల, మార్చి 15: ఆపద మొక్కులు తీర్చే ఆ దేవుడే నిరాదరణకు గురవుతున్నాడు. ఆ దేవ దేవుడు ఇక్కడ మాత్రం శిధిల ఆలయంలో మగ్గిపోతున్నాడు. రాతితో ఈ ఆలయాన్ని నిర్మించగా, అది ఇప్పుడు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. మల్యాల మండలం లంబాడిపెల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య గల వేంకటేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. ఆలయం చుట్టూ పంట పొలాలు వెలియడంతో కనీసం ఆలయానికి వెళ్లేందుకు కూడా దారి లేకపోగా, పొలం గట్లే రహదారులు అవుతున్నాయి. సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించారని చెబుతున్న ఈ ఆలయం చుట్టూ నాడు పెద్ద గ్రామం ఉండగా, పాడి పంటలతో విరజిల్లేదని, క్రమేపి అక్కడి గ్రామం కనుమరుగవడంతో ఆలయం కూడా నిరాదరణకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఆలయ గర్భ గుడి కూలిపోతుండగా, ఆలయ రాతి స్తంభాలు చెదురుతున్నాయి. ఆలయం చుట్టూ పిచ్చి చెట్లు, మొక్కలు ఏపుగా పెరగడంతో ఆలయ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. శివలింగం, నంది విగ్రహాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

ఈ ఆలయం పూర్తిగా నిరాదరణకు గురికావడంతో భక్తులతో పాటు ఈ ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరొందిన ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. అంతేగాకుండా ఆలయానికి భూములు ఉన్నాయని, వాటిని వెలికితీయాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



శివ లింగం, నంది విగ్రహం చుట్టు పేరుకుపోయిన గడ్డి

సాహిత్యంతోనే సమాజ చైతన్యం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న భారతీ సాహితీ సమితి సభ్యులు

కోరుట్ల, మార్చి 15 : సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం వస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టనంలోని సినారే కళాభవనంలో భారతి సాహిత్య సమితి స్వర్ణోత్సవాల వేడుకలను ప్రా రంభించి మాట్లాడారు. కోరుట్ల పట్టణంలో స్వర్గీయ డాక్టర్ అందే వెంకటరాజు 1972లో భారత సాహిత్య సమితిని స్థాపించి సాహిత్యంపై ఈ ప్రాతం ప్రజలకు పరిచయం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి సాహిత్య సమితికి గుర్తింపును తెచ్చాడని అన్నారు. ఈ సందర్భంగా బారతీ సాహిత్య సమితి సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కంజర్ల రామాచార్య, బట్టు హరికృష్ణ, అందే శివప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●పట్టణంలోని మిని స్టేడియంలో మహిళల కోసం మం జూరైన జిమ్‌ను త్వరగా పూర్తి చేసి వినయోగంలోకి తీసుకురావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మున్సిపల్ అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని నమస్తే కోరుట్ల కార్యక్రమంలో భాగంగా ఉదయం మినిస్టేడియాన్ని పరిశీలించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. మినీ స్టేడియంలో సదుపాయాల గురించి క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ముక్తి నిలయం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళల జిమ్ ఏర్పాటుకు రూ. 5లక్షలు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, వార్డు కౌన్సిలర్లు పెండం గణేష్, జిందం లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సీపీఐ నాయకుడు చెన్న విశ్వనాథం, మున్సిపల్ ఎఈ లక్ష్మి, సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్ పాల్గొన్నారు.

కుల సంఘ భవనానికి ప్రొసీడింగ్స్ అందజేత

రాయికల్, మార్చి 15: మండలంలోని మైతాపూర్ గ్రామంలోని ఉత్తరవాడ రెడ్డి సంఘ భవనానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎండీ ల్యాడ్స్ నుంచి మంజూరైన రూ.4 లక్షల ప్రొసీడింగ్స్‌ను శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు సంఘ సభ్యులకు అందజేశారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి, ఎంపీటీసీ రాజనాల మధు కుమార్‌కు ఉత్తర వాడ రెడ్డి సంఘం, మైతాపూర్ గ్రామ బీజేపీ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో రామాజీపేట ఎంపీటీసీ ఆకుల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తొగిటి లక్ష్మీనారాయణ, మండల ఐటీ సెల్ కన్వీనర్ మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ గ్రామ సీనియర్ నాయకులు దొంగ లింగారెడ్డి, రవి, లింగారెడ్డి, శివనీతి కిష్టయ్య, పాలడుగు రామన్న, రాకేష్, హరీష్, రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మెట్‌పల్లి, మార్చి, 15 : విద్యార్థులు భవిష్యత్ కోసం ప్రణాళికలను సిద్ధం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రవీంద్రగర్ల్స్ కళాశాల యాజమాన్యం సుద్దాల రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రవీంద్ర జూనియర్ కళాశాలలో వీడ్కోల్ పార్టీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులు కళాశాలలో చదువులు ముగించుకొని వెళ్లిపోతున్న సీనియర్ విద్యార్థులకు వీడ్కోల్ పార్టీని నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలతో నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. కళాశాల సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించుకుని తల్లి దండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుద్దాల హరికరాజేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఉప్పులపు శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'గీత కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేయాలి'

మెట్‌పల్లి, మార్చి, 15 : గీత కార్మికులకు నూతన గుర్తింపు కార్డులను అందజేయాలని ఎక్సైజ్ శాఖను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. శుక్రవారం మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్‌ను కలిసి నూతన గీత కార్మికులకు, పాత దానిలో తప్పుడు పేర్లను సరిచేసి గుర్తింపు కార్డులను అందజేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత తాలూకా పరిధిలో ఉన్న గీత కార్మికుల సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు లేని వారికి కొత్త కార్డులు, పాత వారి కార్డుల్లో తప్పులుంటే సరి చేసి త్వరగా గుర్తింపు కార్డులను అందజేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను వినతి పత్రం అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

మెట్‌పల్లి, మార్చి, 15 : మెట్‌పల్లి పట్టణంలోని బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు అధికారులను నియమించినట్లు అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి తెలిపారు. శుక్రవారం మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికల నిర్వహణకు న్యాయవాదులు ముగ్గిడి వెంకటనర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్‌లను అధికారులుగా నియమించామన్నారు. నూతన అధికారులకు నియమాక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. న్యాయవాదుల ఓటర్ లిస్ట్‌తో పాటు ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికలను పకడ్బందీగా జరుపుతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంఘం ప్రధాన కార్యదర్శి తెడ్డూ ఆనంద్, ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, న్యాయవాదులు బక్కూరి రమేష్, సుధాకర్, రాజేందర్, గోపి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి నిధుల మంజూరు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు




కృష్ణారావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, మార్చి 15 : రాష్ట్ర ప్రభుత్వం కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి ఎస్‌డీఎస్ ద్వారా 14.48 కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంబంధిత వివరాలను వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు మంత్రులతో కలిసి అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను అందించగా మంత్రులు కోరుట్ల మెట్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ. 14.48 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం పునరుద్ధరణకు రూ.32 లక్షలు, షాదీఖాన అభివృద్ధి పనులకు రూ. 38 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణాలలో నీటి సరఫరాతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు వివరించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు నర్సింగరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

భీమారం, మార్చి 15: భీమారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం అదే పాఠశాలలో చదువుకున్న 2018-19 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పరీక్షా సామగ్రి ప్యాడ్, పెన్నులను అందజేశారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పదవ తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లను అందజేస్తూ పరీక్ష రాసే విధానంపై సూచనలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాల కోసం
ముమ్మర ఏర్పాట్లు



కాంతులీనుతున్న ఆలయం

ధర్మపురి, మార్చి 15: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం పక్షాన తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల ప్రకారం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగనీ యకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు గోపురాలకు, దేవాలయం లోపల, బ్రహ్మపుష్కరిణి (కోనేరు), ఆర్చ్‌లకు అవసరం ఉన్న చోట సున్నాలు, రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అందంగా అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల, బయట ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు, దాతల సహకారంతో రేకుల షెడ్లు, కూర్చొనేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.



ఆలయ గోపురాలకు రంగులు

దేవాలయం లోపల, బయట తడకల పందిర్లు, గోదావరి నది వద్ద పందిర్లు, మహిళలు బట్టలు మార్చు కునేందుకు తడుకలతో డ్రెస్సింగ్ గదులు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఉత్సవాల ప్రచారం కోసం కరపత్రాలు పంపిణీ చేసి వా ల్ పోస్టర్లు అంటించి, ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారు. దేవాలయాలు, స్వామి వారల కల్యాణ వేదిక, బ్రహ్మపుష్కరిణి, ఇతరత్రా ప్రదేశాల్లో పూల తో అలంకరణ చేసేందుకు చర్యలు చేపట్టారు. భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయం లోపల, బయట దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్యవైశ్య, వర్తకులు, రైస్‌మిల్ యజమానులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి భక్తుల సౌకర్యార్థం బ్రాహ్మణ సంఘం, టీటీ డీ ఆవరణలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం లోపల, బయట సోడియం హైపో క్లోరైడ్ స్ప్రే చేయిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగనీయకుండా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటు న్నారు. గత ఏడాది కన్న అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావచ్చని భావించి 25 క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, లక్ష లడ్డూ ప్రసాదాలు తయారు చేయించడంలో అధికారులు, సిబ్బంది నిమగ్నం అయ్యారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్‌తో ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ సమన్వయంతో పని చేసి, ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగనీయ కుండా చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్స్, విజయడైరీ సహకారంతో చల్ల, మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు వితరణ చేసేందుకు చర్యలు తీసుకుం టున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, రినో వేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పనులను పర్యవేక్షించారు.



స్నానఘట్టాల వద్ద వేసిన తడకల పందిర్లు

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 15 : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, కథలాపూర్ మండలంలో కలికోట ప్రాతంలోని సూరమ్మ చెరువు ప్రాజెక్టు పూర్తి చేసామని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుంపేట శ్రీలక్ష్మి నరసింహ స్వామిని దర్శనం చేసుకుని దూలూర్ గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సాగు నీటి రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాడని అన్నారు. వేమలవాడ నియోజవర్గంలోని కథలాపూర్ మండలంలో కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు మొదటి ప్రాధన్యత కల్పించి పూర్తి చేయడానికి సీఎం చర్యలు తీసుకుంటున్నాడని అన్నారు. సూరమ్మ చెరువు ప్రాజెక్టుపై గత ప్రభుత్వం కపట ప్రేమ ప్రదర్శించిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాలో సుమార్ 43 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రాళ్లవాగు ప్రాజెక్టు నిజామాబాదు, జగిత్యాల జిల్లా పరిదిలో ఉందని ఈ ప్రాజెక్టు నిర్వహణ బాద్యతలు ఏదో ఒక ప్రాంతానికి అప్పజెప్పాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీంతో కథలాపూర్ మండల పరిధిలో సుమార్ 3000 ఎకరాలను సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. గతంలో గెలిచిన నాయకులు ఎమ్మెల్యే పదవిని తమ హోదాకు చిహ్నంగా వాడుకున్నారే తప్ప గెలిచి నియోజకవర్గనికి చేసింది ఏమీ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.



గాలి కుంట టీకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● సోషల్ వెల్ఫేర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే
● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి, 15 : విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేట్ శివారులోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, వసతి గృహాన్ని ఎమ్మెల్యే సంజయ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో భోజనం, మంచి నీరు, బాత్రూమ్, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో మాట్లాడి వసతి గృహంలో ఉన్న సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వె ల్ఫేర్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు అనవసరమైన విషయాలు పక్కన పెట్టి ఏకాగ్రతతో చదువుపై శ్రద్ధ పెడితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. పరీక్షలు అనగానే విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని పరీక్షలు రాసే విధానంపై ఉపాధ్యాయుల వద్ద సలహాలు తీసుకోవాలన్నారు. చదువుతోనే మంచి ఉద్యోగమైనా ఏ రంగంలో అయినా రానించవచ్చునని అన్నారు. అనంతరం వసతి గృహం, అవరణ పరిసర ప్రాంతాలు, వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు మెన్ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, ప్రతి ఒక్క విద్యార్థిపై శ్రద్ధ చూపాలని అధ్యాపక బృందానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు ప్రారంభం

కోరుట్ల రూరల్, మార్చి 15 : మండలంలోని అయలాపూర్ గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కొరకు మండల నాయకులు పనులను ప్రారంభించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు కోరకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రభుత్వం నుండి రూ. 5లక్షలు నిదులు మంజూరు చేయడంతో ఎంపీపీ తోట నారయణ, జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్‌లు పనులను ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 3లక్షలు, అంగన్ వాడి కేంద్రం ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షల మంజూరు కాగా పనులకు మండల ప్రజాప్రతినిదులు బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చీటి స్వరూప, గ్రామ మాజీ సర్పంచ్ పిడుగు రాధ -సందయ్య, ఎంపీటీసీ సభ్యుడు బోడ గంగాధర్, నాయకులు నరేష్, తుక్కారెడ్డి, రాజనర్సయ్య, అనంతస్వామి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

చందుర్తి, మార్చి 15: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో వేసవిలో తాగునీటికి ఇబ్బం దులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో డీపీవో వీర బుచ్చయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్ ఉన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నాగారంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి శుక్రవారం పర్యటిం చారు. తాగునీటి సౌకర్యంపై అడిగి తెలుసుకున్నారు. పైప్ లైన్ నిర్మాణం, ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీ ఉంటే వెంటనే సరి చేయాలని సూచించారు. డీపీవో వీర బుచ్చయ్య, ఎంపీవో మీర్జా, పంచాయతీ కార్యదర్శి అప్పాన, వాటర్ కమిటీ చైర్మన్ దుంపేట నాగరాజు, సభ్యుడు ప్రకాష్ పాల్గొన్నారు.



మర్రిగడ్డను సందర్శించిన అదనపు కలెక్టర్ గౌతమి

సీఎం, విప్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం

వెల్గటూర్, మార్చి 15: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం స్తంభంపల్లిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తర్ర బుజ్జన్న, మార్గం సతీష్, పాదం దుబ్బస్వామి, హరి ప్రశాంత్, గొంటి కిరీటి, తిరుపతి, మల్లయ్య, లచ్చయ్య, భూమయ్య, రాజయ్య, మధుకర్, రాజు, మల్లేష్, దుబ్బన్న, అంజిత్, లక్ష్మి, రాజవ్వ పాల్గొన్నారు.

కొడిమ్యాల: రెడ్డి కార్పొరేషన్ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగడి బజారులో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుతో పేద రెడ్డిలకు న్యాయం జరుతుందన్నారు. 2017లో హైదరాబాదులో నిర్వహించిన రెడ్డి మహాగర్జన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి అధికారం లోకి రాగానే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకోవటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలనాయకులు గడ్డం చంద్రమోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

● ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయటం పట్ల కొడిమ్యాల మండల వైశ్యులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే సత్యంకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు ఉన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

'కాన్షిరాం ఆశయ సాధనకు కృషి చేయాలి'

మెట్‌పల్లి, మార్చి, 15 : బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షిరాం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం లోని పార్టీ కార్యాలయం వద్ద కాన్షిరాం 90వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్యవర్ కాన్షిరాం వెనుక బడిన తరుగతుల అభివృద్ధి కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారన్నారు. అనంతరం దేశమంతటా పర్యటించి బహుజనులు రాజ్యాధికారం చేపట్టితేనే పేదల కష్టాలు తొలగిపోతాయని ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, సరేందర్, బాలరాజు, విక్రమ్, రాజ్, అజయ్, వెంకటేష్, గంగాధర్, రవి, విజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బీర్‌పూర్, మార్చి 15: మండలంలోని తాళ్లధర్మారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ మసర్తి రమేష్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పాత పద్మ, రమేష్, కొల్వాయి పీఏసీఎస్ చైర్మన్ నవీన్‌రావు, ప్రచార కమిటీ చైర్మన్ గుడిసె జితేందర్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ యాదవ్ పాల్గొన్నారు.

యువతికి పుస్తెమట్టెలు అందజేత

మల్యాల, మార్చి 15: మల్యాల మండల కేంద్రానికి చెందిన ఉంగరాల వరలక్ష్మి అనే యవతి వివాహం శనివారం జరుగనుండగా మల్యాలకు చెందిన సామాజిక సేవకులు గుండేటి రవితేజ, సంతోష్‌లు యువతికి పుస్తెమట్టెలు అందజేశారు. యువతి కుటుంబసభ్యుల ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే కావడంతో రూ.10వేల విలువైన పుస్తెమట్టెలు అందించారు. వారి వెంట ముకుందు సంతోష్, నాగుల రాకేష్, గుగ్గిళ్ల వెంకటేష్, శివ, గుండేటి రమేష్, రాయనర్సు సాగర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ పక్షోత్సవాలు

బీర్‌పూర్, మార్చి 15: మండలంలోని రేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై గర్భిణులు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులకు, కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలిమ అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ దానిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేవతి, ఆయాలు పాల్గొన్నారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్యాల, మార్చి 15: మల్యాల క్రాస్ రోడ్డు నుంచి రామన్నపేట మీదుగా మేడిపల్లి మండలం కాచారం వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.25 కోట్లు మంజూరి చేయించడం పట్ల ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంజయ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఎంపీగా నియోజకవర్గంలో వేలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. మరోసారి ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకు లు బింగి వేణు, నేరెళ్ల శ్రావణ్, గాజుల మల్లేశం, నులుగొండ సురేష్, పిల్లి రాజశేఖర్, కెల్లెటి రమేష్, బొడిగే సురేష్, పరమేష్, పొన్నం సాయి పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవ కమిటీ ప్రొసీడింగ్స్ అందజేత

రాయికల్, మార్చి 15: రాయికల్ పట్టణంలోని హనుమాన్ ఆలయ ఉత్సవ కమిటీ ప్రొసీడింగ్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, సభ్యులు నరంశెట్టి మనోజ్, రాయల్ల ప్రభాకర్, సందల గణేష్, ఒజ్జెల రాజరెడ్డి, నోముల జ్యోతి, కల్లెడ రాజు పాల్గొన్నారు.

●మండలంలోని మున్నూరుకాపు విప్పకాడ కుల సంఘానికి నిజామాబాద్ ఎంపీ ల్యాడ్స్ నుంచి ప్రొసీడింగ్ కాపీ మంజూరైంది. ఈ ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం బీజేపీ మండల నాయకులు సంఘ సభ్యులకు అందజేశారు. సంఘం నాయకులు, బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

మెట్‌పల్లి, మార్చి, 15 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ తీర్పు రాకముందే కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ, ఐటీ దాడులు చేయడం సుప్రీం కోర్టును దిక్కరించడమేనన్నారు. అక్రమ అరెస్టులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందడానికి ఇలాంటి కేసుల పాల్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, పుల్ల జగన్‌గౌడ్, వెంకటేష్, ఒజ్జెల శ్రీనివాస్, జియా, గంగాధర్, మహేందర్, పాల్గొన్నారు.